క్లుప్తంగా

ముమ్మరంగా సీసీ రోడ్డు పనులు



జొహరాపురంలో సీసీ రోడ్డు నిర్మాణం

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మంజూరైన నిధులతో పల్లెల్లో రోడ్లు, డ్రెయినేజీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆదివారం మండల పరిధిలోని జొహరాపురం గ్రామంలో జీజీఎం నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. గ్రామంలో ఎంపీపీ స్కూల్ వద్ద నుంచి మారెమ్మవ్వ దేవాలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వేగంగా అభివృద్ధి పనులు

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సహకారంతో రూ.5 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు జెడ్పీటీసీ లింగప్ప తెలిపారు. ఈ మేరకు ఆదివారం గ్రామంలో ఫిల్టర్ వాటర్ ప్లాంట్‌లను, పైపులైన్ వ్యవస్థను ఏర్పాటు చేసే పనులను చేపట్టడం జరిగిందని జెడ్పీటీసీ తెలిపారు. ఫిల్టర్ వాటర్ ప్లాంట్లతో గ్రామంలో నీటి సమస్య ఉండదని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామప్రజలు మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గోపాల్, నాయకులు లక్ష్మన్న, సదాశివ, మహాలింగ తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

కృష్ణగిరి: కృష్ణగిరిని కరువు మండలంగా ప్రకటించి రైతాంగాన్ని అదుకోవాలని సీపీఐ నాయకులు రామచంద్రయ్య కోరారు. మండల పరిధిలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామంలో ఆదివారం ఆయన చేనేత కార్మికుడు నాగార్జున ఏర్పాటు చేసుకున్న పవర్‌లూమ్ మగ్గాన్ని ప్రారంభించి అనంతరం మాట్లాడారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని కరువు మండలంగా ప్రకటించి రైతులను అదుకోవాలన్నారు. అలాగే గ్రామాల్లో కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో లెనిన్‌బాబు, రవి మోహన్, రామాంజినేయులు, పరమేశ్వరరెడ్డి, అల్లాబకాష్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

హొళగుంద: గ్రామంలో ప్రజలు పరిసరాల శుభ్రతను పాటిస్తూ దోమల నివారణకు సహకరించాలని హొళగుంద మేజర్ గ్రామ పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్ కోరారు. ఆదివారం రాత్రి వారు హొళగుంద వీధుల్లో దోమల నివారణకు పంచాయతీ సిబ్బందితో ఫాగింగ్ చేయించారు. దోమల వల్ల డెంగీ, టైఫాయిడ్ ఇతర వ్యాధులు ప్రబలుతుండడంతో పంచాయతీ సిబ్బంది ప్రతి రోజూ రాత్రి వీధుల్లో ఫాగింగ్ చేసేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. గ్రామస్తులు చెత్తచెదారం, మురుగు నీరు రోడ్లపైకి వదలకుండా తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

సుంకులమ్మకు ప్రత్యేక పూజలు



గోనెగండ్ల సమీపంలోని సుంకులమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్యస్వామి

గోనెగండ్ల: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గోనెగండ్లతో పాటు కులుమాల, వేముగోడు, హెచ్ కైరవాడి, పెద్దనేలటూర్ తదితర గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గోనెగండ్ల సమీపంలోని ప్రాజెక్టు వద్ద శ్రీ సుంకులమ్మ ఆలయంలో ఆదివారం వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్య స్వామి ఆధ్వర్యంలో నవగ్రహ జపములు, నవగ్రహ హోమాలు, కుంకుమార్చన, ఆకుపూజ, అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. సుంకులమ్మ అమ్మవారు ప్రత్యేక అలంకరణలో పూజలందుకున్నారు. మహిళలు, భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

రాజగోపుర నిర్మాణానికి విరాళం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి ఆదివారం భక్తులు విరాళం అందించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. కర్ణాటకలోని శిరుగుప్ప వాస్తవ్యులు పల్లవి, శేఖర్ దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.50,001 నగదును ఆలయ కార్యాలయంలో అందజేసినట్లు చెప్పారు. ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం దాతలచే స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి, స్వామి వారి తీర్థప్రసాదాలు, పూలమాల, స్వామి వారి శేషవస్త్రాలు, లడ్డూలు, బాండు, ఫొటోను అందజేశారు. భక్తులు విరివిగా విరాళాలు అందించి ఆలయ అభివృద్ధికి పాటుపడాలని వారు కోరారు.

సీఎం పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు



జిల్లాస్థాయి అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి



మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఎమ్మిగనూరుటౌన్/ఎమ్మిగనూరు: జగనన్న చేదోడు పథకం కింద నాలుగో విడత ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు మంజూరు చేసేందుకు ఈ నెల 19వ తేదీన ఎమ్మిగనూరు పట్టణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రానున్న నేపథ్యంలో అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సృజన సూచించారు. ఆదివారం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, జేసీ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌తో కలిసి జూనియర్ కళాశాల మైదానంతో పాటు వెంకటాపురం కాలనీ వద్ద గల స్పిన్నింగ్ మిల్లు మైదానాల్లో హెలిప్యాడ్ స్థలాలను పరిశీలించారు. స్పిన్నింగ్ మిల్లు మైదానంలోనే హెలిప్యాడ్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. అనంతరం వైడబ్ల్యూసీఎస్ గ్రౌండ్‌లో నిర్వహించే సభ స్థలాన్ని పరిశీలించి అక్కడ చేపట్టాల్సిన ఏర్పాట్లపై సూచనలిచ్చారు. హెలిప్యాడ్ నుంచి సభా ప్రాంగణానికి చేరుకునేందుకు నిర్వహించే రోడ్‌షోకు ఎస్ఎంటీ కాలనీ బస్‌స్టాప్ వరకు వచ్చే రోడ్డును పరిశీలించి రోడ్డు మరమ్మతులు సత్వరం చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి సూచించారు. అనంతరం స్థానిక మున్సిపల్ సమావేశ భవనంలో జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. హెలిప్యాడ్ నిర్మాణంతో పాటు అక్కడ డబుల్ బ్యారికెడ్ల ఏర్పాటు, వీఐపీ గ్యాలరీ, పార్కింగ్ తదితర అంశాలపై సంబంధిత అధికారులకు సూచనలిచ్చారు. జగనన్న చేదోడు పథకం లబ్ధిదారులను సభాస్థలికి తరలించేందుకు ఎమ్మిగనూరు నియోజకవర్గంతో పాటు మంత్రాలయం నియోజకవర్గంలోని కోసిగి, పెద్దకడబూరు, దేవనకొండ, ఆస్పరి, కోడుమూరు మండలాలకు ఆర్టీసీ బస్సులను నడపాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా మంచినీటి వసతి, మొబైల్ టాయిలెట్ల ఏర్పాటు బాధ్యతను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తీసుకోవాలని ఎస్ఈ నాగేశ్వరరావుకు సూచించారు. ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపాలిటీల అధికారులు పారిశుధ్య పనుల బాధ్యత తీసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ, ఆర్అండ్‌బీ శాఖలు చేయాల్సిన పనులను వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాలను విద్యాశాఖ నుంచి డీఈఓ రంగారెడ్డి, ఏపీసీలు చూడాలని భోజన ఏర్పాట్లపై పౌరసరఫరాల శాఖ అధికారులకు సూచనలు చేశారు. ట్రాఫిక్ సమస్య, పార్కింగ్ సమస్యలు ఉత్పన్నం కాకుండా తమ వంతుగా చర్యలు తీసుకుంటామని అందుకు సంబంధించిన పలు అంశాలను జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ తెలిపారు. సీఎం పర్యటన ఇన్‌చార్జ్ బాధ్యతలను ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ నిర్వర్తిస్తారన్ని కలెక్టర్ తెలిపారు. ఏవైనా సమస్యలుంటే నేరుగా ఆయన దృష్టికి తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి వచ్చే వినతులకై స్పందన కార్యక్రమం, మెడికల్ పరంగా తీసుకోవాల్సిన అంశాలను డీఎంఅండ్‌హెచ్ఓ రామగిడ్డయ్యను ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, విద్యుత్, ఆర్ అండ్‌బీ ఎస్ఈలు ఉమాపతి, నాగరాజు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిణి విజయలక్ష్మి, డీఎస్పీ సీతారామయ్య, సీఐ మధుసుదన్ రావు, మున్సిపల్ కమీషనర్ గంగిరెడ్డి, ఆర్టీసీ డీఎం అమర్నాథ్, ట్రాన్స్‌కో డీఈ రాఘవేంద్ర, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు దేవరగట్టుకు జిల్లా కలెక్టర్ రాక

హొళగుంద: రాష్ట్రంలో దసరా ఉత్సవాలకు ప్రసిద్ధి చెందిన దేవరగట్టుకు సోమవారం జిల్లా కలెక్టర్ సృజన వస్తున్నట్లు తహసీల్దార్ హుసేన్‌సాహెబ్ తెలిపారు. ఈ నెల 24న విజయదశమి సందర్భంగా దేవరగట్టులో మాళ మల్లేశ్వరస్వామి దసరా 'బన్ని' ఉత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా దేవరగట్టులో ఉత్సవ ఏర్పాట్లు, రింగు కర్రలు, నాటుసారా నివారణ చర్యలు, గ్రామాలలో అవగాహన సదస్సులు, తాగునీరు, ఇతర ఏర్పాట్లకు అధికారులు తీసుకుంటున్న చర్యల గురించి తెలుసుకోనున్నారు. ఈ మేరకు విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, ఆర్అండ్‌బీ ఇతర అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా శాఖల అధికారులు సోమవారం దేవరగట్టులో అందుబాటులో ఉండాలని కోరారు.

జొహరాపురంలో ప్రత్యేక పూజలు

నందవరం: మండల పరిధిలోని జొహరాపురం గ్రామంలో నూతన విగ్రహాలు నవగ్రహాలు, బొడ్రాయి, నందిశ్వరుడికి ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన విగ్రహాలు ప్రతిష్టించి 41వ రోజులు పూర్తి కావడంతో గ్రామంలో విశిష్ట పూజలు చేశారు. పురోహితుడు లోక్‌నాథ్ స్వామి నేతృత్వంతో నవగ్రహాలు, బొడ్రాయి, నందీశ్వరుడికి జలాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, గణపతి పూజ, కలశపూజ, కుంకుమార్చన, శాంతి హోమం తదితర ప్రత్యేక పూజలు గావించారు. భక్తులు పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎంపీటీసీ విజయమోహన్ రెడ్డి, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు శంకరరెడ్డి, నరసింహులు, వెంకటప్ప, వీరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

బన్ని ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

హాలహర్వి: దేవరగట్టులో ఈనెల 24వ తేదీన జరిగే విజయదశమి బన్ని ఉత్సవాలను అన్నివర్గాల ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. ఈ మేరకు ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో ఆయన పోలీస్ సిబ్బందితో కలిసి మండలంలోని బిలేహాల్, విరుపాపురం గ్రామాల్లో పర్యటించారు. ప్రజలతో మాట్లాడుతూ బన్ని ఉత్సవంలో రింగులు తొడిగిన కర్రలను ఉపయోగించడం వల్ల భక్తులు గాయాలపాలవుతున్నారన్నారు. దీంతో ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో బన్ని ఉత్సవాన్ని నిర్వహించుకోవాలని కర్రలను ఉపయోగించరాదన్నారు. బన్ని ఉత్సవం రోజున మద్యాన్ని పూర్తిస్థాయిలో బంద్ చేయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటివారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సెబ్ సీఐ వెంకటేష్, ఎస్ఐలు నాగేంద్ర, రమేష్, వరప్రసాద్, శ్రీనివాసులు ఉన్నారు.

మాళ మల్లేశ్వరుడికి ప్రత్యేక పూజలు

హొళగుంద: దసరా బన్ని ఉత్సవాలకు ప్రసిద్ధి చెందిన దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి విరాట్‌మూర్తులకు ఆదివారం పత్యేక పూజలు జరిగాయి. స్వామివారాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని దర్శించుకోవడానికి ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలో మూల విరాట్‌మూర్తులకు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, బందరార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహామంగళారతి, నైవేద్య సమర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

చేదోడుతో వృత్తిదారులకు ఎంతో మేలు



కౌన్సిలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన చేదోడు పథకం వృత్తిదారుల వారికి ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 19వ తేదీన పట్టణంలోని వైడబ్ల్యూసీఎస్ మైదానంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేదోడు పథకం నాలుగో విడత ఆర్థిక సహాయం మంజూరు చేయనున్న నేపథ్యంలో ఎమ్మెల్యే ఆదివారం సాయంత్రం తన నివాసంలో కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం సభను విజయవంతం చేసేందుకు కౌన్సిలర్లు కృషి చేయాలని, అధిక సంఖ్యలో లబ్ధిదారులు సభాస్థలికి వచ్చేలా కృషి చేయాలని సూచించారు. ఆయా వృత్తిదారులకు ఏటా రూ.10 వేల ఆర్థిక సహయం అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు.వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, నాయకులు రియాజ్‌అహమ్మద్, బసిరెడ్డి, బుట్టారంగయ్య, వీరేంద్ర, సునీల్‌కుమార్, షబ్బీర్‌అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పరుగు పోటీలకు ఎంపిక

వెల్దుర్తి: రాష్ట్రస్థాయి పరుగు పందెం పోటీలకు తమ గురుకులం క్రీడాకారులు ఐదుగురు ఎంపికైనట్లు స్థానిక మహాత్మా జ్యోతాబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ షబానా తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన అండర్–14 విభాగంలో 400, 100 మీటర్ల ఈవెంట్లకు ఎం.అర్చన, అండర్–17 విభాగంలో 600 మీటర్ల పందెంలో ఈ దివ్య, 100 మీటర్ల పందెంలో బి.రాజేశ్వరి, 800 మీటర్ల పందెంలో కె.వరలక్ష్మి విశేష ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. పీఈటీ షబానాను క్రీడాకారులను అభినందిస్తూ రాష్ట్రస్థాయిలోనూ రాణించాలని అభిలషించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

తుగ్గలి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని బి.మానస రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు సంధ్యానాయక్ ఆదివారం తెలిపారు. ఉమ్మడి జిల్లా అండర్–18 ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో పగిద్యాలలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. చిత్తూరు జిల్లా యాదమర్రిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో మానస పాల్గొంటుందని చెప్పారు. ఎంపికైన విద్యార్థినిని హెచ్‌ఎం జయలక్ష్మి, ఉపాధ్యాయులు, పీఎంసీ చైర్మన్ మల్లికార్జున అభినందించారు.

తహసీల్దార్ కార్యాలయం మార్పు

దేవనకొండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో పొదుపు కార్యాలయ భవనం నుంచి రెవెన్యూ సేవలు కొనసాగించేలా జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని తహసీల్దార్ వెంకటేష్‌నాయక్ తెలిపారు. సోమవారం నుంచి పొదుపు కార్యాలయానికి సంబంధించిన భవనం నుంచి తహసీల్దార్ కార్యాలయ సేవలు అందుతాయని చెప్పారు. ప్రజలు, రైతులు గమనించాలన్నారు.

మసీదు సందర్శన

హొళగుంద: సామరస్యానికి సంకేత సూచకంగా గురువారం హొళగుందలో 'జమాతే అహ్లె హదిస్' ఆధ్వర్యంలో నిర్వహించిన మస్జీద్ సందర్శన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. సర్వ ధర్మాల సారాంశం ఒక్కటేనని చెప్పడంతో పాటు సామాజంలోని అన్ని వర్గాల వారితో ఐక్యత, శాంతి సామరస్యాలను పెంపొందించుకునేందుకు గాను ఈ కార్యక్రమం నిర్వహించినట్లు 'జమాతే అహ్లె హదిస్' హొళగుంద శాఖ సభ్యులు తెలిపారు. ఎగ్జిబిషన్‌లో సందర్శకులకు అనేక అంశాల గురించి హైదరబాద్ నుంచి వచ్చిన వక్తలు వివరించారు. చిప్పగిరి జెడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫివుల్లా, నాయకుడు ఈశా, కుమారస్వామి, ఎస్ఐ శ్రీనివాసులు, గ్రామపెద్దలు రాజ పంపన్నగౌడ్, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

మిరపలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

గోనెగండ్ల: మిరప పంటను సాగుచేసిన రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని సహాయ వ్యవసాయ సంచాలకులు మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత సూచించారు. ఆదివారం మిరప రైతులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. మిరపలో ముడత, తామర, నల్ల తామరలను నివారించడానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. వాటి నివారణకు జిగురు అట్టలు ఎకరాకు 100 చొప్పున పసుపు రంగువి– 40, నీలం –30, తెలుపు– 30 ఏర్పాటు చేసుకుని, పురుగు మందులను పిచికారీ చేయాలన్నారు. ప్రతి స్ప్రే తరువాత ఒకసారి బవేరియా, వర్టి సీలియంల పిచికారీ చేస్తూ ఉంటే నల్ల తామరను అదుపులో ఉంచవచ్చునన్నారు. అలాగే ముడత, తామర పురుగులకు రసాయన పురుగు మందుల వాడకం అసిఫెట్ 1.5 గ్రాము/లీటర్, అసిటామప్రిడ్ 0.2 గ్రాము/లీటర్, ఫిప్రొనిల్ 5 శాతం 2 మిల్లీలీటర్లు, ఇమిడాక్లోప్రిడ్ 40 శాతం, ఫిప్రోనిల్ 40 శాతం 0.2 గ్రాము/లీటర్, డైఫెన్ తయురాన్ 1.5గ్రా/లీటర్, ఫిప్రోనిల్ 80 శాతం 0.2గ్రాము/లీటర్, సయనాంత్రనిలిప్రోల్ 1.2 మిల్లీ లీటర్లు, ఫెన్ ప్రోపాత్రిన్ 0.5 మిల్లీలీటర్లు, టోల్ఫెన్ పైరాడ్ 2 మిల్లీలీటర్లు, క్లోరోఫెన్ పైర్ 2 మిల్లీలీటర్లు, స్పైనోసాడ్ 0.25 మిల్లీ లీటర్లు, ప్లినజోలిన్ 0.4 మిల్లీ లీటర్లు, బ్రోఫ్లానిలైడ్ 0.17 మిల్లీ లీటర్లు, ఫ్లుక్సామెటమైడ్ 1 మిల్లీ ప్రతి లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. పై మందులలో ఒకే మందును పంట కాలంలో రెండు సార్లకంటే ఎక్కువ వాడరాదన్నారు.

'హంద్రీనీవా'లో గుర్తు తెలియని మృతదేహం

కృష్ణగిరి: కృష్ణగిరి మండల పరిధిలోని తొగర్చేడు గ్రామం నుంచి వెల్దుర్తి వెళ్లే రహదారి ఉన్న హంద్రీనీవా కాలువలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు..ఉదయం 11 గంటల సమయంలో కాలువలో కంపచెట్లకు తట్టుకుని మృతదేహం ఉందని గ్రామస్తుల సమాచారం అందిచగా వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వీఆర్వోతో కలిసి మృతదేహాన్ని నీటి నుంచి బయటకు తీశారు. మృతుడు నలుపు రంగులో ఉన్నాడు. శరీరంపై తెల్లని ఫుల్‌కాటన్ బనియన్, నశ్యపు రంగు నిక్కరు, రెండు పోరల ఎర్రని మొలతాడు దానికి రుద్రాక్ష కట్టబడి ఉండి కుడి చేతికి రాగి ఉంగరం ధరించినట్లు ఎస్ఐ తెలిపారు. ఐదున్నర అడుగుల ఎత్తు 40 నుంచి 45ఏళ్ల మధ్య వయస్సు ఉంటుందని తెలిపారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు అనుమాన్పద మృతిగా కేసు నమోదుచేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా ఆచూకీ తెలిస్తే కృష్ణగిరి పోలీస్‌స్టేషన్ 9121101117 నెంబర్‌కు తెలియజేయాలని ఆయన కోరారు.

తల్లిదండ్రులకు తెలియకుండా టూర్

- విద్యార్థుల ఆటోను అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఆలూరు: తల్లిదండ్రులకు తెలియకుండా సాంఘిక సంక్షేమ వసతి గృహంలో చదువుతున్న విద్యార్థులను వాచ్‌మ్యాన్ టూర్‌కు తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఆస్పరి మండలం చిన్నహోతూరు వెనుకబడిన తరగతులకు చెందిన బాలుర వసతి గృహం విద్యార్థులకు ఈనెల13 నుంచి దసరా సెలవులు ఇచ్చారు. అదే వసతి గృహంలో కాంట్రాక్టు పద్ధతిన వాచ్‌మ్యాన్‌గా పనిచేస్తున్న బ్రహ్మయ్య.. విద్యార్థులను టూర్‌కు తీసుకెళ్తానని చెప్పారు. ఇందుకు రూ. 500 చొప్పున వసూలు చేశాడు. మొత్తం 30మంది విద్యార్థులతో ఆటోలో ఆస్పరిలో ఈ నెల 14వ తేదీన టూర్‌కు బయలుదేరారు. కోడుమూరు, నందికొట్కూరు, ఆత్మకూరు ప్రాంతాల్లో పర్యటించాలనేది వీరి ప్రణాళిక. అయితే సెలవులు ఇచ్చినా తమ పిల్లలు ఇంటికి చేరుకోకపోవడంతో తల్లిదండ్రులు హెచ్‌డబ్ల్యూఓ అనిమిరెడ్డికి ఫోన్ ద్వారా చేరవేశారు. వసతి గృహంలో పనిచేస్తున్న బ్రహ్మయ్య విద్యార్థులను విహారయాత్రకు తీసు కెళ్లుతున్నారని ఆస్పరి పోలీసులకు సమచారాన్ని చేరవేశారు. దీంతో పోలీసులు నందికొట్కూరు వద్ద విద్యార్థుల వాహనాన్ని పట్టుకున్నారు. విద్యార్థులను ఇళ్లకు పంపడంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. వాచ్‌మ్యాన్ బ్రహ్మయ్యపై హెచ్‌డబ్ల్యూఓ అనిమిరెడ్డి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

కులగణన చర్యలపై హర్షం



ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

ఆదోనిఅర్బన్: ఎన్నో యేళ్ల నుంచి నిలిచిపోయిన, కులగణన చేపట్టాలని ధైర్యంగా అసెంబ్లీలో రిజర్వేషన్ పాస్ చేసి ముందు కెళ్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి 139 కులాల తరఫున ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వచ్చే నెల 18వ తేదీ నుంచి కులగణన కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. 1931లో ఒకసారి జరిగిందని, మళ్లీ పది సంవత్సరాల తర్వాత 1941లో జరిగిందని, రెండో ప్రపంచ యుద్ధం రావడంతో అప్పటి నుంచి కులగణన జరగలేదన్నారు. మళ్లీ ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధైర్యంగా నిలబడి అసెంబ్లీలో కులగణను సంబంధించిన రిజర్వేషన్ పాస్ చేసి చర్యలు తీసుకోవడం హర్షణీయమన్నారు. కులగణన వల్ల 139 కులాల్లో ఎవరు ఎంత మంది ఉన్నారు. ఎవరికి ఎంత రిజర్వేషన్ ఉంటుందని స్వచ్ఛందంగా బయట పడుతుందన్నారు. ఇంతటి మహత్తర కార్యక్రమం నవంబర్ 18వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని, ఇందుకు కృషి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్



నిందితుడిని చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న సెబ్ సీఐ హరికృష్ణ

ఆదోనిరూరల్: ఆదోని పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఆటో స్టాండు వద్ద ఆదివారం తనిఖీలు చేస్తుండగా పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డారని సెబ్ సీఐ హరికృష్ణ తెలిపారు. వారి వద్ద ఉన్న బ్యాగులో 4 ఓసీ డీలక్స్ విస్కీ కర్ణాటక మద్యం బాక్సులు ఉండడంతో స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడు బోయ నాగరాజు పట్టుబడగా, మరో వ్యక్తి బోయ నాగిరెడ్డి తప్పించుకుని పారిపోయాడన్నారు. నిందితులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో ఆదోని సెబ్ ఎస్ఐ హరికృష్ణ, ఎస్ఐ శివప్రసాద్, పీసీ శ్రీనివాస్, సుధాకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మద్దికెరలో పూజలందుకుంటున్న మద్దమాంబ అమ్మవారు



ఆలూరులో శైలపుత్రి అలంకరణలో వాసవీమాత



తుగ్గలిలో బాలత్రిపురసుందరిగా దుర్గాదేవి

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రులు



ఆస్పరిలో కన్యకాపరమేశ్వరీ మాతను దర్శించుకుంటున్న భక్తులు



వెల్దుర్తిలో వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి అభిషేకానికి సిద్ధేశ్వరస్వామి ఆలయం నుంచి గంగాజలాన్ని తీసుకెళ్తున్న ఆర్యవైశ్యులు



హొళగుందలో.. దేవమ్మ



మద్దికెరలో ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరి దేవి



స్వర్ణకవచ దేవీ అలంకరణలో పెద్దమ్మ తల్లి

పత్తికొండటౌన్: స్వస్తిశ్రీ శోభకృత్ నామ సంవత్సరం ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి 15వ తేది నుంచి జరిగే విజయదశమి 'దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు' పత్తికొండ పట్టణంలో ఆదివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. స్థానిక కొత్తపేటలోని కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో కొలువైన వాసవీమాత శ్రీరాజరాజేశ్వరీ దేవి అలంకారంలో కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే స్థానిక సాయిమందిరం ప్రాంగణంలోని సరస్వతీదేవి ఆలయ ప్రాంగణంలో దేవీశరన్నవరాత్రుల ఉత్సవాలను పురస్కరించుకుని అర్చకులు చందూస్వామి ఆధ్వర్యంలో ఉదయం గణపతిహోమం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అలంకారంలో కొలువై భక్తులకు దర్శనమిచ్చారు.

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథుడిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివార్లను గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అలాగే స్థానిక మద్దమాంబ అమ్మవారి దేవాలయం, చౌడేశ్వరి దేవాలయం, నగిరేశ్వర దేవాలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులకు ప్రసాదం వినిమయం చేశారు.

నందవరం: విజయదశమి పర్వదినం సందర్భంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆదివారం గురజాల గ్రామంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో పార్వతి దేవి అమ్మవారు బాలత్రిపురసుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పూజారి హంపేష్‌స్వామి ఆధ్వర్యంలో ఆది దపంతులు రామలింగేశ్వర స్వామి, పార్వతి దేవికి తెల్లవారుజామున జాలభిషేకాలు, పంచామృతాభిషేకాలు, అష్టోత్తర శతనామావళి, కుంకుమార్చన వంటి ప్రత్యేక పూజలు గావించారు. టి.సోమలగూడూరులో పురోహితుడు శ్రీధర్‌స్వామి, ఆలయ పూజారి తిరుమలరెడ్డి నేతృత్వంలో పెద్దమ్మ తల్లిని స్వర్ణకవచ దేవీ అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. గ్రామస్తులు, చుట్టు పక్కల గ్రామాల నుంచి తరలి వచ్చిన భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ గావించారు.

ఆలూరు: స్థానిక కర్నూలు–ఆదోని రోడ్డు సమీపంలో ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవీని విజయదశమి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం శైలపుత్రి అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ అర్చకులు నరేంద్రశాస్త్రి ఆధ్వర్యంలో అమ్మవారికి గంగాజలంతో అభిషేకం, కుంకుమార్చన, పుష్ప, ఫల అలంకరణ, పంచామృతాభిషేకం, మహా మంగళహారతి పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య కుటుంబసభ్యులు, ఆలయకమిటీ నిర్వాహకులు, గ్రామస్తులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో పూలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.